# అంతర్యం

## డాక్టర్ డి.వి. సత్యనారాయణ

"సుందరి ప్లీజ్! ఈ ఒక్కసారి ఒప్పుకోవూ!"

"అబ్బ.... నన్ను విసిగించకండీ.... అసలే నాకు ఓపిక లేదు. దీనికి తోడు ఈ ముదనష్టపు ఎండలు...."

"అంతేనంటావా? ఆఖరిసారిగా అడుగుతున్నాను...."

"అంతే.... అంతే.... అంతే...." విసుగ్గా జవాబు ఇచ్చింది.

సుందరి – సుబ్బారావులకు పెళ్ళయి ఆరు నెలలు అయింది. సుబ్బారావుది రాయలసీమలోని "గిద్దలూరు" దగ్గఱ ఒక పల్లెటూరు. అతనికి గుంటూరులోని వైశ్యాబ్యాంక్‌లో ఉద్యోగం. సుందరిది కూడా గుంటూరునే! సుబ్బారావు మిగతా అన్నలు ఆ పల్లెలో వ్యవసాయం చేసుకుంటూ, ఉమ్మడి కుటుంబంగా ఉంటున్నారు. ఆ ఇంట్లో చదువుకున్నదీ, ఉద్యోగం చేస్తున్నదీ సుబ్బారావు ఒకడే! గుంటూరులో ఉన్న సుబ్బారావు ఒక శుభముహూర్తాన సుందరితో చూపులు కలిపాడు. సుందరి కూడా తొలి చూపులోనే సుబ్బారావును ప్రేమించింది. ప్రేమించి, ప్రేమించబడి పెళ్ళి చేసుకున్న సుబ్బారావుకు ఇప్పుడు ఒక సమస్య ఎదురయింది. సుబ్బారావు వాళ్ళకు, ఊరిలో వారి తాతగారు కట్టించిన "రామాలయం" ఉంది. ప్రతి "శ్రీరామనవమికి", వాళ్ళ కుటుంబం పెద్ద ఎత్తున ఆ ఊరిలో మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుపుతారు. సుబ్బారావు ప్రతి శ్రీరామనవమికి ఆ ఊరు వెళ్తాడు. ఈసారి "నవమి"కి సుందరిని వెంట పెట్టుకొని ఊరికి వెళ్ళాలని తెగ ఉత్సాహంగా ఉంది సుబ్బారావుకు. కాని సుందరికి సుబ్బారావు మీద ఉన్న ప్రేమ, అతని పల్లెటూరు మీద లేదు. గుంటూరు లాంటి పట్టణంలో పుట్టి పెరిగిన సుందరికి పల్లెలు అంటి తెగ అలర్జీ. అందుకే సుబ్బారావు వెంట ఊరికి రానంటే రానని మొండి కేసింది. సుబ్బారావు అలిగాడు. మూడు రోజులు ఇంట్లో తిండి మానేసి హోటల్స్ వెంట పడ్డాడు. అందుకే సుందరి కళ్ళకు సుబ్బారావు సగం చిక్కిపోయాడు. అతడు చిక్కిపోవడం చూడలేక చివరకు "సరే" అంది సుందరి. ఎగిరి గంతేసాడు సుబ్బారావు..ఆ సాయంత్రమే వెళ్ళి ట్రైన్‌కు రిజర్వేషన్ చేయించాడు. ప్రయాణం పొడుగునా తెగ జోరుగా ఉన్నాడు సుబ్బారావు. సుందరి మాత్రం కిటికీ ప్రక్క సీటులో మూతి ముడుచుకొని, కూర్చుంది. మధ్య మధ్యలో పేపర్ చాటు చేసుకొని, సుందరితో సరసాలాడ బోయాడు. సుందరి విసురుగా తోసి వేసింది అతని చేతులను. ఆమె రుసరుసలు, విసవిసల మధ్య అతని ఉత్సాహం నీరుగారి పోయింది. ఊరు చేరిన సుబ్బారావు ఇంట్లో సుందరిని వదిలిపెట్టి నవమి సంబరాలలో పడ్డాడు. ఊరిలో ఆటల పోటీలు నిర్వహించడం, గాన కచేరీలు ఏర్పాటు చెయ్యడంతో అతనికి క్షణం తీరిక లేదు. ఉత్సవాలు ముగిసిన తరువాత సుందరి–సుబ్బారావులు గుంటూరు ట్రైన్ ఎక్కారు.



"సారీ సుందరి! ఊరిలో నిన్ను అసలు పట్టించుకోనే లేదు కదూ! బాగా బోర్ కొట్టిందా?" పేపర్ చాటున సుందరి వేళ్ళని అప్యాయంగా నొక్కుతూ, నొచ్చుకుంటూ అడిగాడు. గుంటూరు వెళ్ళిన తరువాత తన పని పడుతుందని అతనికి లోపల భయంగానే ఉంది.

"అబ్బే అదేం లేదండీ.... మీ ఊరిలో ఆడవాళ్ళు ఎంత మంచి వాళ్ళండీ.... ఈసారి నవమికి కూడా వద్దాం.... ఏం...." దంగై పోయాడు సుబ్బారావు. వచ్చేటపుడు మూతి ముడుచుకొని కూర్చున్న సుందరి, తిరుగు ప్రయాణంలో తెగ ఉత్సాహంగా కబుర్లు చెప్పసాగింది. సుందరి ఉత్సాహానికి కారణం బుర్ర బద్దలు కొట్టుకున్నా అంతుబట్టలేదు సుబ్బారావుకు.

* * * *

ఊరి నుండి వచ్చిన నెల రోజుల తరువాత, ఒక రోజు ఎదో ఉత్తరం వచ్చింది అంటూ తెచ్చి ఇచ్చింది సుందరి. అది సుబ్బారావుకు వాళ్ళ అన్నయ్య వ్రాశాడు. అందులో వాళ్ళ అమ్మాయి "రజస్వల" అయినట్లు ఉంది. అదే విషయం చెప్పాడు సుందరితో.

"అలాగా! అయితే మరలా మనం మన ఊరు వెళ్ళాలి కదండీ! ఆ అమ్మాయికి మనం వేడుకలు చేయించాలిగా! ఎప్పుడు వెళ్దాం అంటారు?" చాలా సంతోషంగా అడిగింది.సుబ్బారావు తెల్లబోయాడు.

ఏమండీ.... మరలా వెళ్దామండీ.... మన ఊరు.... గారాలుపోతూ అంది సుందరి. ఆమెను ఆకర్షించింది ఆ ఊరిలో ఏముందో అర్థం కాలేదు సుబ్బారావుకు. అతనికి కూడా భార్యతో ప్రయాణం చెయ్యాలంటే మహా సరదాగా ఉంది. మరలా టికెట్స్ రిజర్వ్ చేయించాడు. ఈసారి సుందరి లగేజ్ ఒక పెద్ద సూట్‌కేసుకు తయారు చేసింది. అంత పెద్ద సూట్‌కేసను చూడగానే సుబ్బారావు విసుక్కున్నాడు. ఆమె అది ఏమీ పట్టించుకో లేదు. ఊరు వచ్చేంతవఱకూ చాలా ఉషారుగా ఉంది సుందరి. ఇంటికి వచ్చిన తరువాత భోజనం చేసి ఊరిలో పడ్డాడు సుబ్బారావు. పాత స్నేహితులతో గడిపి, సాయంత్రం ఇంటికి వచ్చాడు. ఇంటిలో పలికి అడుగు పెట్టబోతూ ఒక్క క్షణం ఆగాడు. ఇంటి వసారా అంతా దాదాపు ఊరిలోని ఆడవాళ్ళతో నిండి ఉంది. వాళ్ళ మధ్యలో చాప మీద కూర్చొని ఉంది సుందరి. ఆమె వెంట తీసుకొచ్చిన సూట్‌కేస్ ఆమె ఎదురుగా ఉంది. దానిలోని చీరలు అన్ని కుప్పగా పరిచి ఉన్నాయి. ఆడవాళ్ళ చేతులలో సుందరి చీరలు! వాటిని వాళ్ళు తన్మయంగా చూస్తున్నారు. సుందరి గర్వంగా ఎదో చెప్పుకుపోతూ ఉంది.

"ఓలమ్మో.... ఎన్ని చీరలో! అబ్బో.... ఎంత బాగున్నాయో".... ఊరిలోని ఆడంగుల మాటలు సుబ్బారావు చెవికి వినపడుతూనే ఉన్నాయి. ■

